# సెల్కి హెల్ప్ స్ప్రే

భమిడిపాటి సోమయాజి

కొంతమందికి ఫోన్ అంటే అతి మక్కువ, మహాసరదా. ఏదైనా మాట్లాడుకునేటప్పుడు ఫోన్ మోగితే 'అదిగో జయ గంట మోగింది. శుభం మనం అనుకున్నది జరిగి తీరుతుంది' అంటుంటారు.

పక్కింట్లో ఫోన్ మోగినా వీళ్ల ఇంట్లో మోగినట్లే సంతోషిస్తారు.

ఇదేనేమో తరతమభేదం లేకుండా ఉండడం అంటే. ఇలా ఫోన్ సరదా ఉన్న వ్యక్తే హలో మూర్తి. ఫోన్లు అస్తమానం రాకపోయినా అతనే "హలో" అంటూ ఫోన్ చేసి మాట్లాడతాడు.

ఏ బస్సులోనైనా ఆఫీస్‌కి వెళ్లేటప్పుడు ప్రతివాళ్లనీ తెలిసినా తెలియకపోయినా హలో అని పలకరిస్తుంటాడు.

అసలు వీడెవరో తెలుసుకునేలోపు వాళ్లు దిగవలసిన స్టాప్ వచ్చి వాళ్లు దిగి వెళ్లిపోతుంటారు.

అందర్నీ హలో అని తెలియకపోయినా పలకరిస్తాడని ప్రసిద్ధి పొందిన మూర్తిని అతని స్నేహితులు 'హలోమూర్తి' అని అతనికి పేరు పెట్టి సంతోషిస్తున్నారు.

మూర్తి ఆఫీస్‌కి రాగానే "ఏమయ్యా! నిన్న మొత్తం ఎన్ని ఫోన్‌కాల్స్ వచ్చాయి" అని అడుగుతారు.

"ఏమిటోనయ్యా! నిన్న తొమ్మిదే వచ్చాయి. మొత్తం పది వచ్చాయిగానీ ఒకటి నేను బాత్రూమ్‌లో ఉండడంవలన మాట్లాడలేకపోయాను" అని చెబితే-

"ఆ...అది కూడా వచ్చినట్టే వేసుకో అంటూ "అదికాదయ్యా... నువ్వు ఒక సెల్‌ఫోన్ సంపాదించు. అదైతే బాత్రూమ్‌లోంచి కూడా మాట్లాడవచ్చుకదా" అని ఉచిత సలహా పదే పదే ఇస్తుంటారు.

ఈ సలహా కూడా బాగానే వున్నట్లు తోచింది హలో మూర్తికి.

ఒకసారి మూర్తి బాత్రూమ్‌లో ఉండగా ఫోన్ మోగితే గబగబా బయటకు వచ్చాడు.

అదే టైమ్‌కి మూర్తి అత్తగారు ఎవరూ చూడకుండా తను తెచ్చిన డబ్బులో ఎంత మిగిలిందో లెక్కపెడుతోంది.

ఎవరైనా చూడవచ్చుగానీ అల్లుడు తన డబ్బు అసలు చూడకూడదన్న సిద్ధాంతాన్ని బాగా నమ్మిన మహిళ అవడంవలన ఒక్కసారిగా అల్లుడుపై విరుచుకుపడింది.

"ఈ వెధవ ఫోన్... తెల్లారితే ఈ ఫోన్ పట్టుకు వేల్లాడ్డమెందుకో? స్నానం మధ్యలో ఆపవలసిన అగత్యమేమిటో నాకర్థంకాలేదు. నేనో, అమ్మాయో చూస్తాంకదా. ఏమైనా సీక్రెట్ ఫోన్స్ వస్తాయా?" అంటూ తన డబ్బు పెట్లో పెట్టేసింది.

"అదికాదత్తయ్యా! మీరు ఇక్కడ ఉంటారనుకోలేదు" అన్నాడు.

"నేను సర్వాంతర్యామిని. ఎక్కడైనా ఉంటాను" అంది అత్తగారు.

"సరే క్షమించండి"

"క్షమించడం కాదు, నేనసలు ఇక్కడ ఏం చేస్తున్నానో తెలుసా?" అందావిడ ఆ డబ్బు చూసాడో లేదో తెలుసుకుందామని.

అసలా డబ్బు చూడని మూర్తి "ఈరోజు మీ ప్రయాణం కదా. బట్టలు సర్దుకుంటున్నారు" అన్నాడు.

'బ్రతికిపోయావు ఫో...' అన్న ధోరణిలో "వెళ్లు స్నానం పూర్తయితేగానీ ఎప్పుడూ బయటకు రాకు" అని గద్దించింది.

ఈ సెల్‌ఫోన్ ఏర్పాటు చేసుకోవడం విషయంలో ఈ సంఘటన కళ్ళముందు కదిలింది. అసలు ఒక సెల్‌ఫోన్ ఉంటే ఆ రోజు బాత్రూమ్ నుంచి బయటకు రావాల్సి వచ్చేదికాదుకదా. పైగా ప్రతి వాళ్లచేతిలోనూ సెల్‌ఫోన్ వుంటోంది. ఇవ్వన్నీ ఆలోచించి ఒక సెల్‌ఫోన్ కొనేసాడు. దానికి తాడు కట్టుకుని మెళ్లో వేసుకున్నాడు.

అది చూసిన అత్తగారు మూర్తితో సరదాగా అంది.

"ఏమిటయ్యా దాన్ని మెళ్ళో వేసుకున్నావు మూర్ఛరోగిలా? జేబులో పెట్టుకో. చూడలేకపోతున్నాం"

"అవునమ్మా... నేనూ అదే అన్నాను. వినడం లేదు" అంది శ్రీమతి మూర్తి.

"ఏమిటయ్యా పెళ్లాం చెబితే వినాలి. మీ మామగారు నా మాట వినడంవలన ఎన్ని అవకతవకలు బయటపడ్డా మూడు ప్రమోషన్లు తెచ్చుకున్నారు తెలుసా" అంది అత్తగారు.

"అమ్మా! పెళ్లాం చెబితే వినాలి అనే సినిమా కూడా వచ్చిందికదే" అంది శ్రీమతి మూర్తి.

"ఆ సినిమా ఓసారి చూపిస్తే సరి" అంది అత్తగారు అదేదో భక్తకన్నప్ప సినిమాలాగా.

"అటువంటి పనికొచ్చే సినిమాలు చూడరే అమ్మా" అంది కూతురు.

మొత్తంమీద తల్లీకూతుళ్ల రభసవలన ఆ సెల్‌ఫోన్ మెళ్లోంచి జేబులోకి వచ్చింది.

ఒకసారి మూర్తి శ్రీమతితో కలసి విజయవాడ పెళ్లికి వెళ్తున్నాడు.

బస్సు నార్కెట్‌పల్లి వస్తుందనగా మూర్తి సెల్‌ఫోన్ మోగింది.

"హలో" అన్నాడు మూర్తి.

"నేనురా అవతారాన్ని. ఎక్కడున్నావు?" అన్నాడు అవతారం.

"బస్సులో మా శ్రీమతితో కలసి పెళ్లికి వెళ్తున్నాను"

"ఎవరిది పెళ్లి?"

"మా శ్రీమతి స్నేహితురాలిది"

"ఏడిసావులే. ఎక్కడ, ఆమె పక్కనే కూర్చున్నావా?"

"అవును"

"వెంటనేలే. లేచి నిలబడి నేను చెప్పేది విను"

"ఆ...చెప్పు."

"ఏంలేదు. ఈరోజు మన ఫ్రెండ్స్ అందరూ కలసి గండిపేట వెళుతున్నాం. చాలా సరదాగా గడపడానికి ఏర్పాట్లు చేసాం. పేకాట కూడా వుంది. వెంటనే నీ ప్రయాణం ఆపేసుకో" అన్నాడు అవ

తారం.

"ఏమిటీ సార్. కూర్చుని మాట్లాడుకోండి" అన్నాడు కండక్టర్.

"ఉండవయ్యా బాబు. అవతల అవతారం నిలబడి మాట్లాడమంటున్నాడు" అన్నాడు మూర్తి.

అవతలాయన నిజంగా ఏమైనా అవతారమేమో అనుకుని కండక్టర్ లెంపలేసుకుని "ఆయన చెప్పినట్లే చేయండి" అన్నాడు.

"బస్సు ఇప్పుడెక్కడుంది?" అన్నాడు అవతారం.

"నార్కెట్‌పల్లి" అన్నాడు మూర్తి.

"దిగిపో. వెంటనే దిగిపో. దిగి వెనక్కు వచ్చేయ్"

మూర్తి మొహం దీనంగా పెట్టుకుని 'ఏమిటో ఈ వెధవ సెల్‌ఫోన్ కొని పీకలమీదకు తెచ్చుకున్నాను' అన్నాడు.

"ఏమయిందండీ?" అంది శ్రీమతి.


"ఏమవడమేమిటి? ఈ ఒక్కరోజు సెలవుఇచ్చినట్లే ఇచ్చి కేన్సిల్ చేసేసి వెంటనే ఆఫీస్‌కి వచ్చేయమన్నాడు మా ఆఫీసర్. ఏదో ఫైల్ కనబడడంలేదుట"

"వెధవ ఫైలు. ఆ ఒక్క ఫైలే కావాలా ఈవేళ? అన్ని ఫైల్స్ ఉంటే ఏదో ఒక ఫైల్ చూసుకోవచ్చుగా" అంది శ్రీమతి మూర్తి ఏదో ఒక సినిమా చూసుకోవచ్చుకదా అన్నట్లు.

"మరి నేను నార్కెట్‌పల్లిలో దిగిపోతా" అన్నాడు.

"ఆ...నార్కెట్‌పల్లిలో దిగండి బాబూ" అన్నాడు కండక్టర్.

"దిగుతున్నాం బాబూ" అంటూ మూర్తి ఆలస్యం చేయకుండా దిగిపోయాడు.



దిగిపోయి మళ్లీ తన శ్రీమతి బస్సు ఎక్కించేస్తుందేమోనన్న భయంతో కాఫీ హోటల్లోకి దూరిపోయాడు.

"ఆ...విజయవాడ" అంటూ బస్సుకి రైట్ చెప్పేసాడు కండక్టర్.

దిగిన తరువాత తన జేబులో ఉండిపోయిన విజయవాడ బస్ టిక్కెట్ కనిపించింది.

మూర్తికి గుండె గుభేలుమంది.

ఈ దిగిపోదామన్న హడావిడిలో తన శ్రీమతికి ఆ టిక్కెట్ ఇవ్వడం మరచిపోయాడు.

వెంటనే అవతారానికి ఫోన్ చేసి చెప్పాడు.


"నేను వెళ్లిపోతానురా. టిక్కెట్ మా ఆవిడకు ఇవ్వలేదు. దారిలో చెకింగ్ అయితే ఏ గొడవైనా అవుతుంది"

"నీ మొహం ఆ టిక్కెట్ చింపేయ్. తరువాత ఆ టిక్కెట్ ఆవిడకే ఇచ్చేసినట్లు దబాయిద్దువుగానీ"

## సృజనాత్మకత



సృజనాత్మకతకి చిరునామా కావాల్సిన చిత్రరంగం ఎప్పుడూ మూసధోరణిలో ముందుకెళుతుంటుంది. దీనికి కారణం తెలియదు గానీ కొత్తదనంతో జనం ముందుకి వచ్చే చిత్రాలు అందర్నీ అలరిస్తుంటాయి. అపూర్వ లఖియా కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్టున్నాడు. అమితాబ్‌బచ్చన్, అర్జున్ రాంపాల్‌లతో పాటూ పెరిజాద్ జొరాబియన్ హీరోయిన్‌గా ఏక్ అజ్‌నబీ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. 'బాలీవుడ్‌లో కథలకి కొరత లేదు. కొత్తదనాన్ని ఆదరించి జనం ముందుకి తెస్తే వారి ఆదరణ కూడా లభిస్తుంది' అంటున్నాడు. అన్నట్టు ఈ చిత్రంలో పెరిజాద్ డిఫరెంట్‌గా కన్పిసుందంటున్నారు.




'నిజంగా నువ్వు అవతారమేరా! సంభవామి యుగే యుగే' అనుకున్నాడు మూర్తి.

***

మూర్తి వెనక్కి వచ్చేసాడు.

గండిపేటలో సాయంకాలం ఘుమఘుమలాడే మందు కొడుతూ పేకాట ఆడుతున్న సమయంలో శ్రీమతి మూర్తి అతని సెల్‌కి ఫోన్ చేసింది.

"బస్ టిక్కెట్ ఇవ్వకుండా దిగిపోయారు. ఆడకూతుర్ని అని కూడా చూడకుండా అయిదువందలు ఫైన్ వేసారు" అని చెప్పింది.

ఇంతలో "నాది షో" అన్నాడు అవతారం.

"నాది ఫుల్ కౌంట్" అన్నాడు ఇంకొకడు.

"అరవకండిరా. కొంప మునిగింది. మా ఆవిడ వినే ఉంటుంది" అని మూర్తి అన్నాడు.

"మీది కూడా ఫుల్‌కౌంటే అయ్యుంటుంది. లెక్కపెట్టి డబ్బులు ఇచ్చేయండి. ఇవతల అయిదువందలు పోయిందని నేను ఏడుస్తుంటే అవతల మీరు పేకాటలో కూడా తగలెయ్యండి. ఇక మన సంసారం బాగుపడదండీ" అంది ఆవిడ ఏడుపుగొంతుతో.

"అదికాదే" అన్నాడు మూర్తి.

"పోన్లెండి అదృష్టం... కౌంట్ కాదన్నమాట. అసలు మిమ్మల్ని ఇలా కాదండీ. ఆఫీసర్ రమ్మన్నాడని చెప్పి నార్కెట్‌పల్లిలో దిగిపోయారు. ఈ పేకాట గురించి ఆఫీసర్ రమ్మన్నాడని అబద్ధం ఒకటి. కనీసం టిక్కెట్ ఇద్దామన్న ఆలోచన కూడా లేదు మీకు. పైగా పెళ్లిలో ముచ్చటగా కట్టుకుందామన్న పట్టుచీర కూడా మీ సూట్‌కేసులోనే వుండిపోయింది. ముహూర్తం టైమ్‌కి అందరూ పట్టుచీరల సింగారించుకుని తిరుగుతుంటే నేను మాత్రం ఒక సాదాసీదా చీర కట్టుకుని నీరసంగా ఉండిపోయాను. అసలా సెల్‌ఫోన్ ఎవడు కొనమన్నాడు? ఆ దరిద్రం లేకపోతే మీరు నాతోపాటే పెళ్లికి వచ్చేవారు కదా. ఇవన్నీ చూస్తుంటే మీకు ఇక బుద్ధి వస్తుందన్న నమ్మకం కూడా పోతోంది నాకు" అంది.

ఇంతలో అవతారం సెల్‌ఫోన్ అందుకుని "అమ్మా మహాతల్లీ... మీ భార్యాభర్తల గొడవలెప్పుడూ ఉండేవేగానీ మమ్మల్ని కాస్త ప్రశాంతంగా ఆడుకోనీ తల్లీ" అన్నాడు.

***

ఈసారి అటో ఇటో తేల్చుకుందామని నిశ్చయించుకున్న శ్రీమతి మూర్తి సరాసరి తన పుట్టింటికి వెళ్లి తన తల్లిదండ్రుల్ని తీసుకుని హైదరాబాద్‌కు వచ్చింది.

అప్పుడు చాలా గొడవలయ్యాయి.

"నేనెన్నోసార్లు చెప్పాను నీకు. ఈ జూదంవల్ల ధర్మరాజు అంతటివాడు భార్యను కూడా ఓడిపోయి అడవులు పట్టాడని. అయినా నువ్వు వినడంలేదు" అని చీవాట్లు పెట్టింది అత్తగారు.

"ఈసారి కనుక పేకాట ఆడితే మా అమ్మాయిని పుట్టింటికి తీసుకుపోతాం. ఇక నీ అన్నం నువ్వే వండుకోవాలి" అని గదమాయించాడు మామగారు.

ఇంతలో సెల్‌ఫోన్ మోగింది.

"చూడండి. మళ్లీ మీ ఆఫీసర్ ఏమైనా ఫోన్ చేసాడేమో" అంది వెటకారంగా శ్రీమతి మూర్తి.

"ఇది సెల్ కాదే నా పాలిట హెల్" అంటూ కోపంగా బయటకువెళ్లి ఆ సెల్‌ఫోన్ అమ్మేసాడు.

ఆ తరువాత ఎవరైనా కనిపిస్తే హలో అని అనడం కూడా మానేసాడు.

★